క్లుప్తంగా

మన్ననలు పొందేలా పనిచేయాలి



నందిగామరూరల్:బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులతోపాటు నూతన కమిటీ సభ్యులంతా న్యాయవాదుల మన్ననలు పొందేలా పనిచేయాలని నందిగామ మాజీఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు సూచించారు. బార్ ఎన్నికలలో విజయం సాధించిన అధ్యక్షుడు నంద్రు బాబు విద్యాసాగర్, కార్యదర్శి అద్దంకి మణిబాబుతోపాటు పలువురు కమిటీ సభ్యులు గురువారం రాత్రి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ న్యాయవాదులు ఎంతో నమ్మకంతో ఓట్లేసి గెలిపించారని వారి నమ్మకాన్ని నిలబెట్టేలా పని చేయాలని కార్యవర్గానికి సూచించారు. నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపి ఘనంగా సత్కరించారు.కార్యక్రమంలో న్యాయవాదులు పింగళి లక్ష్మీనరసింహారావు, కన్నెకంటి జీవరత్నం, మంగళపూడి కోటి, షేక్ సైదా, సన్ని తదితరులు పాల్గొన్నారు.

క్రీస్తు శిలువమార్గంలో విశ్వాసులు



బత్తినపాడు(కంచికచర్ల): మండలంలోని బత్తినపాడు గ్రామంలో క్రైస్తవులు శుక్రవారం సిలువ మార్గం చేపట్టారు. గ్రామ పురవీధుల్లో సిలువను మోసుకుంటూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రీస్తు ప్రభువు పాపుల రక్షణ కోసం వచ్చాడని ఆయన బోధనల ప్రకారం నడుచుకున్న వారికి ఎటువంటి అపాయం కలగదని ఆర్సీఎం చర్చి ఉపదేసి మాదాసు లూకాసు పేర్కొన్నారు.. గ్రామ పురవీధుల్లో ముందుగానే ఏర్పాటు చేసిన 14స్థలాల వద్దకు వెళ్లి ప్రత్యేక ఆరాధన చేశారు.అనంతరం భక్తులు, విశ్వాసులు ఆలయానికి చేరుకుని దివ్య బలిపూజలో పాల్గొన్నారు.

పీహెచ్‌సీ పరిశీలన

పెనుగంచిప్రోలు:స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం నందిగామ ఆర్డీఓ కె బాలకృష్ణ శుక్రవారం పరిశీలించారు. రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్యసేవలను అడిగితెలుసుకున్నారు. పీహెచ్‌సీలోని సదుపాయాలను పరిశీలించారు. పీహెచ్‌సీ పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని, సిబ్బంది ఎల్లప్పుడూ రోగులకు అందుబాటులో ఉండాలని సూచించారు. తహసీల్దార్ ఎ.శాంతిలక్ష్మి, వైద్యాధికారి పి ఇందిర, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

కంచికచర్ల: ఇష్టపడి చదివితే ఎంత కష్టమైన సబ్జెక్టు అయినా తేలిగ్గా ఉంటుందని ఎస్‌ఐ బోనగిరి రాజు పేర్కొన్నారు. స్థానిక ఎంపీపీ స్కూల్‌లో విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

నందిగామటౌన్:పరిశుభ్రమైన నందిగామ కోసం ప్రతిఒక్కరూ సహకరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి కోరారు. పట్టణంలోని 14వవార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా కృష్ణకుమారి మాట్లాడుతూ స్వచ్ఛ నందిగామ ప్రజలందరి బాధ్యతన్నారు. చెత్తను వేసేందుకు చెత్త కుండీలను వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రీ సర్వే : ఆర్డీఓ



జయంతి(వీరులపాడు):రైతుల వ్యవసాయ భూములకు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకే ప్రభుత్వం రీ సర్వే ప్రాజెక్టును చేపట్టిందని ఆర్డీవో కె.బాలకృష్ణ తెలిపారు. మండలంలోని జయంతి గ్రామంలో శుక్రవారం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న భూముల రీ సర్వే ప్రారంభోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీసర్వే కార్యక్రమానికి రైతులు సహకరించాలన్నారు. రీసర్వేతో దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న భూముల సమస్యలు త్వరితగతిన పరిష్కారమవుతాయని తెలిపారు. ముఖ్యంగా సర్వేలో పాల్గొనే సిబ్బంది కూడా రైతులకు ఇబ్బందులు లేకుండా సర్వే చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ హుస్సేన్, సర్పంచి మారపాక మహాలక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు ఇప్పల సత్యనారాయణరెడ్డి, సొసైటీ చైర్మన్ జంగా కోటిరెడ్డి, గ్రామనాయకుడు భరత్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కన్నీటి ఘడియలు

- ముంచుకొస్తున్న జలముప్పు
- వేగంగా అడుగంటుతున్న భూగర్భజలాలు
- ఎండిపోతున్న చెరువులు, మున్నేరు, కృష్ణానది
- యంత్రాంగం అప్రమత్తత అవసరం



కంచికచర్ల మండలం చెవిటికల్లు వద్ద చుక్కనీరు లేక ఎడారిని తలపిస్తున్న కృష్ణానది



విద్యుత్ మోటార్లకు అందని సప్లయి చానల్‌లోని తాగునీరు

కంచికచర్ల : భూమాతకు గర్భశోకం వచ్చింది. భానుడి ప్రతాపంతో ఆతల్లి కడుపులో దాచుకున్న జలమట్టం రోజురోజుకు తగ్గిపోతోంది. ఓవైపు నందిగామ నియోజకవర్గంలోని కుంటలు, చెరువులు, బావులు, బోరుబావుల్లో నీళ్లు అడుగంటిపోతుండుగా మరోవైపు మున్నేరు. కృష్ణానదిలో చుక్కనీరు లేక భూతలం అంతా ఎడారిని తలపిస్తోంది. ఫలితం ఈ ప్రాంతంలో కన్నీటి ఘడియలు ముంచుకొస్తున్నాయి. నీటికోసం జనం నీరసించిపోయే పరిస్థితులు నెలకొంటున్నాయి. వేసవి ప్రారంభంలోనే దుర్భిక్షం ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. కొన్ని గ్రామల్లో నీటికోసం చుక్కలు చూడాల్సి వస్తుంది. ఒక వైపు ఎండ తీవ్రత, మరో వైపు వేడిగాలుల దాటికి నీరు ఆవిరవుతోంది. చెరువులు, కుంటల్లో జలాలు లేకపోవడంతో పరిస్థితి ఇబ్బందికరంగా మారుతోంది. నందిగామ నియోజకవర్గంలో రోజురోజుకు భూ గర్భ జలమట్టం పాతాళంలోకి చేరుతోంది. దీంతో అన్నదాతలు, ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ప్రధానంగా నియోజకవర్గంలో తాగు, సాగునీటికి సమస్యలు ఏర్పడే పరిస్థితులు నెలకొంటున్నాయి. పలు మండలాల్లో వేసవి ప్రారంభంలోనే నీటిఎద్దడి సమస్యలు తలెత్తుతున్నాయి. కరెంట్ కోతతోపాటు సాగునీటి వనరులు అడుగంటిపోవడంతో అన్నదాతలు అయోమయానికి గురవుతున్నారు.

వేసవి ప్రారంభంలోనే కష్టాలు...

వేసవి ప్రారంభంలోనే నీటికష్టాలు తప్పటం లేదు. నందిగామ నియోజకవర్గంలోని పలు గ్రామాల ప్రజలు ఇప్పటికే తాగునీటి ఇబ్బందులతో అవస్థలుపడుతున్నారు. కొన్ని గ్రామాల్లో మంచినీటి సరఫరా కాకపోవటంతో ప్రజలు వ్యవసాయ బావులు, బోరు బావులపై ఆధారపడి కాలం వెళ్లదీస్తున్నారు. నియోజకవర్గంలోని కంచికచర్ల వాసులు తాగునీటి కోసం పేరకలపాడు క్రాస్‌రోడ్డు కిలోమీటర్ దూరంలో ఉన్న సంప్‌వెల్ వద్ద బైక్‌లు, ఆటోలు, కార్లు వేసుకుని వెళ్లి తాగునీటి తెచ్చుకుంటున్నారు. వీరులపాడు మండలం దొడ్డదేవరపాడు గ్రామానికి చెందిన ప్రజలు తాగునీటి కోసం వైరా ఉపనదిలో చెలవ తీసుకుని తాగునీటిని తెచ్చుకుంటున్నారు. కొంతమంది ప్రజలు మినరల్ వాటర్ ప్లాంట్ల వద్ద తాగునీటికి కొనుగోలు చేసి దాహం తీర్చుకుంటున్నారు. మారుమూల గ్రామాలకు రక్షిత మంచినీటి పథకం ద్వారా తాగునీరు సరఫరా చేసేందుకు ప్రధాన పైప్‌లైన్‌లు వేసినప్పటికీ అవి వేసవికాలంలో ధ్వంసమవుతున్నాయి. కంచికచర్ల, వీరులపాడు మండలాల్లోని 25 గ్రామాలకు చెవిటికల్లు వద్ద కృష్ణానదిపై కంచికచర్ల, బత్తినపాడు పైలెట్ ప్రాజెక్టుల ద్వారా తాగునీరు సరఫరా అవుతుంది. కాని ప్రస్తుతం తాగునీరు సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు.



చెవిటికల్లు కృష్ణానదిలో అమరావతి వైపు నుంచి పైలెట్‌ప్రాజెక్టుకు తాగునీరు సరఫరా చేసే కాల్వ

ఎండుతున్న రబీ పంటలు ..

రబీ సీజన్‌లో రైతులు వరి, మొక్కజొన్న పంటలను సాగుచేశారు. అయితే ఈ ప్రాంతంలోని కృష్ణానది, మున్నేరు, వైరా ఉపనదుల్లో నీరులేక ఎడారిలా తలపిస్తున్నాయి. దీంతో పంటలకు అవసరమయ్యే సాగునీరు అందక పంటలన్నీ చేతికి రాకముందే ఎండిపోతున్నాయి.



కృష్ణానది ఒడ్డున కంచికచర్ల పైలెట్ ప్రాజెక్టు ఫిల్టర్‌బెడ్‌లో అపరిశుభ్రంగా ఉన్న తాగునీరు

ట్యాంకర్ల ద్వారా నీటిసరఫరా

నీటి సంరక్షణ ప్రతిఒక్కరూ బాధ్యతగా భావించి నీటిని పొదుపుగా వాడుకోవాలి. అప్పుడే భావి తరాలకు నీటి ఎద్దడి లేకుండా చేయవచ్చు. తాగునీటి సమస్యలున్న గ్రామాల్లో ఇంకుడు గుంటలు ఏర్పాటు చేసుకోవాలి. నీటి సమస్య ఉన్న గ్రామాల్లో గ్రామపంచాయతీ పాలకులు ట్రాక్టర్ ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేయాలి.

ఎంవీఎస్ఎస్ శాస్త్రి,
డీఈఈ, ఆర్‌డబ్ల్యూఎస్ నందిగామ

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులు వీరే

జగ్గయ్యపేట అర్బన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆపార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం జగ్గయ్యపేట అసెంబ్లీ నియోజకవర్గంలో ఆపార్టీ వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమిస్తూ ఒక ప్రకటన విడుదల చేసింది. జగ్గయ్యపేట నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడిగా నరమనేని వెంకటేష్, మహిళా విభాగం అధ్యక్షురాలిగా చల్లా సుశీల నియతులయ్యారు. కనగాల రమేష్ (రైతు విభాగం), జవ్వాజి నరసింహారావు(బీసీ సెల్), కీసర లోకేష్(ఎస్సీసెల్), బాణావత్ రాజు(ఎస్టీ సెల్), షేక్ రసహుస్సేన్(మైనార్టీసెల్), బసిపోగు ఆనందపాల్ అలియాస్ రమేష్(క్రిస్టియన్ మైనార్టీ సెల్)అధ్యక్షుడిగా నియమితులయ్యారు.
వేముల నాగార్జున(విద్యార్థి విభాగం), వేమిరెడ్డి వెంకటనారాయణరెడ్డి(పంచాయతీ విభాగం), వేల్పుల నవీన్(మున్సిపల్ విభాగం), వాసిరెడ్డి కృష్ణారావు(ఆర్టీఐ విభాగం), రెంటాల నాగభూషణం (వాలంటీర్ల విభాగం), బోసెట్టి బ్రహ్మం(గ్రీవెన్స్ విభాగం), డేరంగుల శ్రీనివాసరావు(వాణిజ్య విభాగం), ఆటిపాముల వెంకన్న(చేనేత విభాగం), మెండెం రామారావు(వైఎస్సార్ టీయూసీ), అంగన్‌వాడీ విభాగం అధ్యక్షురాలిగా ధరావత్ శ్యామల, లీగల్ సెల్ అధ్యక్షుడిగా ఓర్సు రాజు నియమితులయ్యారు. నియోజకవర్గ సాంస్కృతిక విభాగం అధ్యక్షుడిగా కారుపాటి జీవరత్నం, వీరమాచనేని నవీన్(సోషల్ మీడియా విభాగం), బండి రంజిత్ కుమార్(ఐటీ విభాగం), పూర్ణకంటి బాబురావు(దివ్యాంగుల విభాగం), పసుపులేటి శ్రీనివాసరావు(డాక్టర్స్ విభాగం), మేడా కోటేశ్వరరావు(ఇంటిలెక్చువల్స్ ఫోరం), లేళ్ల నాగేంద్రరెడ్డి(బూత్ కమిటీ విభాగం), బైరబోయిన బాబు(ప్రచార విభాగం) అధ్యక్షుడిగా నియమితులైనారు. ఈ సందర్భంగా ఆయా విభాగాల అధ్యక్షులుగా ఎంపికైన నాయకులు మాట్లాడుతూ తమ నియామకానికి సహకరించిన వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్, నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

నందిగామ నియోజకవర్గంలో..

కంచికచర్ల: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహనరెడ్డి ఆదేశాల మేరకు ఆపార్టీ కేంద్ర కార్యాలయ ప్రతినిధులు నందిగామ నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమిస్తూ ప్రకటన విడుదల చేశారు. నందిగామ నియోజకవర్గ యూత్ వింగ్ అధ్యక్షుడిగా నల్లాని అయ్యన్న, మహిళా విభాగం అధ్యక్షురాలిగా నాయుడు ఉదయలక్ష్మి నియమితులయ్యారు. గోనెల సీతారామయ్య(రైతు విభాగం), పెర్మసాని నరసింహారావు(బీసీసెల్), మంగలపూడి కోటేశ్వరరావు(ఎస్సీసెల్), గుగులోతు శివనాయక్(ఎస్టీసెల్), షేక్ మలక్‌బషీర్(మైనార్టీ సెల్), పాల్ శంకరరెడ్డి(క్రిస్టియన్ మైనార్టీసెల్), నాదెండ్ల నరేంద్ర(విద్యార్థి విభాగం), చిలుకూరి బుచ్చిరెడ్డి(పంచాయతీరాజ్ వింగ్), షేక్ జాఫర్(మున్సిపల్ విభాగం), కోట మోహనరావు(ఆర్టీఐ వింగ్) అధ్యక్షుడిగా నియమితులయ్యారు. చిక్కోళ్ల రాము(వలంటీర్ల వింగ్), వల్లెపు రవి(గ్రీవెన్స్‌సెల్), రాచూరి సీతారామ్(వాణిజ్య విభాగం), షేక్ మీరా(వైఎస్సార్ టీయూసీ), విజయలక్ష్మి(అంగన్‌వాడీ వింగ్), షేక్ సైదా(లీగల్‌సెల్), మార్కపూడి ప్రసాద్(కల్చరల్ వింగ్), గొల్లపల్లి జమలయ్య(సోషల్ మీడియా), కేశవులు(దివ్యాంగుల విభాగం), షేక్ జయాలుద్దీన్(డాక్టర్స్ విభాగం), ఉలవలపూడి నరేంద్ర(ఇంటలెక్చ్యువల్ ఫోరం), వెలగా సత్యనారాయణ(బూత్ కమిటీ వింగ్), పబ్లిసిటీ సింగ్ అధ్యక్షుడిగా షేక్ మిద్దిలాల్ నియమితులయ్యారు. ఈసందర్భంగా నూతన అధ్యక్షులు మాట్లాడుతూ తాము పార్టీకి చేసిన సేవలను గుర్తించి, పార్టీలో సముచిత స్థానం కల్పించిన పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్, నందిగామ మాజీఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ డాక్టర్ అరుణకుమార్‌లకు కృతజ్ఞతలు తెలియజేశారు.

మెడికల్ షాపుల ఇష్టారాజ్యం

- లైసెన్స్ రద్దు చేసినా కొనసాగుతున్న షాపులు
- యజమానులతో డ్రగ్స్ తనిఖీ అధికారులు కుమ్మక్కు



పేటలో లైసెన్స్ రద్దు చేసినప్పటికీ అమ్మకాలు చేస్తున్న ఓ మెడికల్ షాపు యాజమాన్యం

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట పట్టణంలోని కొన్ని మందుల దుకాణాలు నిబంధనలు పాటించకుండా ఇష్టారీతిన మందులను విక్రయిస్తూ ప్రజారోగ్యం చెలగాటమాడుతున్నాయి. మత్తు మందులు, గడువు తేదీ ముగిసిన మందులు, నిషేధించిన ప్రమాదకర మందులను, అబార్షన్‌కు ఉపయోగించే కిట్‌లను విక్రయిస్తున్నాయి. డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా ఆయా టాబ్లెట్లు, ఇంజక్షన్లు, ప్రెగ్నెన్సీ పోగొట్టే కిట్‌లు విక్రయిస్తుండటం ప్రజారొగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టివేస్తోందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

లైసెన్స్ రద్దు చేసినా అమ్మకాలు మామూలే..

జగ్గయ్యపేట పట్టణంలో సుమారు 80మెడికల్ షాపులు, నియోజకవర్గ వ్యాప్తంగా మూడు మండలాలకు కలిపి మరో 40 మెడికల్ షాపులు ఉన్నాయి.పేటలో గతేడాది నిషేధిత మందులు, గడువు తేదీ ముగిసిన మందులు, మత్తు మందులు అమ్మకాలు చేస్తున్నారనే ఫిర్యాదు మేరకు ఇటీవల జగ్గయ్యపేట డ్రగ్ ఇన్స్‌పెక్టర్ కె.సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేశారు. తనిఖీల్లో మణికంఠ సాయి మెడికల్ అండ్ ఫ్యాన్సీ స్టోర్, శ్రీవాసవి మెడికల్ అండ్ జనరల్ స్టోర్, స్నేహ మెడికల్ అండ్ జనరల్ స్టోర్, వెంకటేశ్వర మెడికల్ అండ్ ఫ్యాన్సీ స్టోర్‌లో నిషేధిత మందులు విక్రయించినట్లు అధికారులు గుర్తించారు. దీంతో ఈ నాలుగు షాపుల లైసెన్స్‌ను ఏడురోజులపాటు సస్పెండ్ చేశారు. అయినప్పటికీ ఆయా షాపుల యజమానులు యథేచ్ఛగా దుకాణాలు తెరిచి మందులను విక్రయించారు. ఈవిషయంపై ఆశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందడంతో 20మంది సభ్యులతో కూడిన డ్రగ్ అధికారుల బృందం జగ్గయ్యపేటకు వచ్చి ఆ షాపులను సీజ్ చేసి తాళాలు వేశారు. ఈమేరకు ఉన్నతాధికారులు ఆయా మందులషాపుల లైసెన్స్‌ను కూడా క్యాన్సిల్ చేశారు. అయితే సదరు షాపుల యజమానులు తమ రాజకీయ పలుకుబడిని వినియోగించి లైసెన్స్‌ల రద్దు ఆర్డర్‌ను తాత్కాలికంగా నిలిపివేయించడం గమనార్హం. ఈ విషయంపై జగ్గయ్యపేట డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కె.సురేష్‌కుమార్ మాట్లాడుతూ ఆఫైలు తనవద్ద లేదని, ఏడీసీ అనిల్‌కుమార్ వద్ద ఉందని వివరించారు. విజయవాడ అసిస్టెంట్ డ్రగ్ కంట్రోలర్ అనిల్‌కుమార్‌ను వివరణ కోరగా జగ్గయ్యపేటలో నాలుగు మెడికల్ షాపుల లైసెన్స్ రద్దు చేసిన ఆర్డర్‌కు సంబంధించి కొన్ని లీగల్ ఇష్యూలు కూడా ఉన్నాయి. దీంతో డిటైల్డ్‌గా ఎగ్జామిన్ చేసి పైఅధికారుల అనుమతి తీసుకుని చర్యలు తీసుకుంటామని వివరించారు.

నవోదయకు ఎంపిక



వెల్లుర్తిపాడు(పెనుగంచిప్రోలు): మండలంలోని వెల్లుర్తిపాడు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న విద్యార్థిని చిర్రా యశస్వి కృష్ణ ఇటీవల నిర్వహించిన జవహర్ నవోదయ ప్రవేశపరీక్షలో ఉత్తమ ప్రతిభ కనపరచి సీటు సాధించినట్లు హెచ్‌ఎం వై.కిషోర్ తెలిపారు. ఎటువంటి శిక్షణ లేకుండా ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ సీటు సాధించడంపై మండల విద్యాశాఖాధికారులతోపాటు గ్రామస్తులు విద్యార్థిని యశస్వికృష్ణను అభినందించారు.

దేవినేని అవినాష్‌ను కలిసిన నాయకులు



జగ్గయ్యపేట అర్బన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన కన్నమాల శామ్యూల్ శుక్రవారం ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్‌ను విజయవాడలోని ఆయ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. దేవినేని అవినాష్‌కు కృతజ్ఞతలు తెలియజేసి, ఆయనను సత్కరించారు. శామ్యూల్‌ను అవినాష్ ఘనంగా సత్కరించారు. పార్టీ పటిష్టతకు మరింత కృషిచేయాలని అవినాష్ సూచించారని శామ్యూల్ తెలిపారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు ఏలూరు శివాజీ, పేట పట్టణ కార్మిక, ప్రచార విభాగాల అధ్యక్షులు గంగోలు వినోద్, గోగుల వెంకయ్య, గండ్రాయి యూత్ అధ్యక్షుడు కొత్తపల్లి సురేష్, సీనియర్ నాయకులు బండి రాజు, శీలం మంగారావు, దార్ల ప్రసన్నకుమార్, గడ్డాటి వెంకటరత్నం, భీమవరపు కుమార్ పాల్గొన్నారు.

మిర్చి రైతులకు పరిహారం ఇవ్వాలి : తన్నీరు



బాధిత మిర్చి రైతులతో మాట్లాడుతున్న తన్నీరు నాగేశ్వరరావు

భీమవరం(వత్సవాయి):మిర్చి రైతులకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం అందించి ఆదుకోవాలని వైఎస్సార్‌సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. జగ్గయ్యపేట పట్టణ సమీపంలోని సాయి తిరుమల కోల్డ్ స్టోరేజీలో జరిగిన అగ్నిప్రమాదం కారణంగా తీవ్రంగా నష్టపోయిన భీమవరంలోని మిర్చి రైతులతో శుక్రవారం ఆయన సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కోల్డ్ స్టోరేజీలో నిల్వ చేసిన మిర్చి బస్తాలలో 50 శాతం భీమవరం గ్రామానికి చెందిన రైతులవే ఉన్నాయన్నారు. కోల్డ్‌స్టోరేజీ యాజమాన్యం ఇన్సూరెన్స్ రెన్యువల్ చేయకపోవడంతో అగ్నిప్రమాదం కారణంగా రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా మారిందన్నారు. ప్రభుత్వం ప్రత్యేక కమిటీ వేసి రైతులకు నష్టపరిహారం వెంటనే అందేలా చూడాలన్నారు. రైతులకు న్యాయం జరిగే వరకు వైఎస్సార్ సీపీ పోరాడుతుందని వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గుత్తా శంకరరావు, జిల్లా కార్యదర్శి రూప్లానాయక్, సొసైటీ మాజీ అధ్యక్షులు కనగాల రమేష్, పెనుగొండ శ్రీనివాసరెడ్డి, నాయకులు రంగారెడ్డి, నాగులు హుస్సేన్, గంగిపోగు రమేష్, కారుపాటి ఏసుబాబు, చింతకుంట్ల బ్రహ్మారెడ్డి, అంగడాల హుస్సేన్, శ్రీనివాసరెడ్డి, షేక్ బాజి తదితరులు పాల్గొన్నారు.

బాధిత రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి : సీపీఎం



కోల్డ్‌స్టోరేజీ శిథిలాలను పరిశీలిస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి డీవీ కృష్ణ, నాయకులు

జగ్గయ్యపేట అర్బన్: పట్టణ సమీపంలోని సాయి తిరుమలగిరి కోల్డ్‌స్టోరేజ్ అగ్నిప్రమాదఘటనలో నష్టపోయిన 400 మంది రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని సీపీఎం పార్టీ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి డీవీ.కృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సాయి తిరుమలగిరి కోల్డ్ స్టోరేజ్‌ని సీపీఎం నాయకులు శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా డీవీ కృష్ణ మాట్లాడుతూ కోల్డ్ స్టోరేజ్‌లో అగ్నిప్రమాదం జరిగి ఐదురోజులు అవుతున్నప్పటికీ ఇంత వరకు ప్రభుత్వం గానీ, యాజమాన్యం గానీ స్పందించకపోవడం దారుణమన్నారు. ముందుగానే యాజమాన్యం రైతుల పేరుతో రూ 6.60 కోట్లు బ్యాంకులోను తీసుకోవడం, అగ్ని ప్రమాదం జరగడానికి ముందు కొంత మిర్చి బస్తాలను తీసి బయటకు తరలించడం పలు అనుమానాలకు దారి తీస్తోందన్నారు. జిల్లా అధికారులు, కలెక్టర్ అగ్ని ప్రమాదానికి గురైన కోల్డ్ స్టోరేజ్‌ను సందర్శించి నష్టపోయిన రైతులకు భరోసా ఇవ్వాలని కోరారు. అగ్నిప్రమాదంలో మిర్చి దగ్ధం కావడంతో నష్టపోయిన రైతులకు క్వింటా మిర్చికి రూ.20వేల చొప్పున అందించి వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షం తమ పార్టీ తరపున రైతుల పక్షాన నిలిచి పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్‌సీహెచ్.శ్రీనివాస్, పార్టీ మండల, పేట పట్టణ కార్యదర్శి ఎస్.నాగమణి, పార్టీ నాయకులు కోటా కృష్ణ, దంతాల నరేంద్ర, కె.లింగారావు, కోటా రవికుమార్, షేక్ గౌస్‌మియా, షేక్ మీరాసాహెబ్, రావెళ్ల శేషు, వీవీ.రాంప్రసాద్ పాల్గొన్నారు.

జడ్జిని కలిసిన నూతన కార్యవర్గం



నూతన కార్యవర్గానికి అభినందనలు తెలుపుతున్న 16వ అదనపు జిల్లా జడ్జి శ్రీనివాసరావు

నందిగామటౌన్: నందిగామ బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని 16వ అదనపు జిల్లా జడ్జి శ్రీనివాసరావు సూచించారు. స్థానిక కోర్టు ఆవరణలో శుక్రవారం బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు శుక్రవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిశాలరు. ఈ సందర్భంగా జడ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నంద్రు బాబువిద్యాసాగర్, కార్యదర్శి అద్దంకి మణిబాబు, వైస్ ప్రెసిడెంట్ వరదబోయిన విజయ్‌కుమార్‌లతోపాటు కమిటీ సభ్యులకు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో నూతన కమిటీ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

పది పరీక్షలకు 6,043 మంది హాజరు



పెనుగంచిప్రోలులో పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఆర్డీఓ కె.బాలకృష్ణ

నందిగామరూరల్: నందిగామ డివిజన్‌లోని నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల పరిధిలో జరుగుతున్న పదోతరగతి పరీక్షల్లో భాగంగా గురువారం జీవశాస్త్రం పరీక్ష నిర్వహించారు. డివిజన్ పరిధిలోని 40 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షకు 6,121మంది విద్యార్థులకుగాను 6,043మంది హాజరయ్యారు. ఈ పరీక్షకు 78మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఇన్‌చార్జి డీవైఈఓ సాంబశివరావు తెలిపారు. నందిగామ నియోజకవర్గంలోని 25 పరీక్షా కేంద్రాల పరిధిలో 3,565మందికిగాను 3,507మంది పరీక్షకు హాజరుకాగా, 58 మంది గైర్హాజరయ్యారు. నందిగామ మండలంలో 1,481మందికిగాను 1,470 మంది హాజరయ్యారు. 11మంది గైర్హాజరయ్యారు. కంచికచర్ల మండలంలోని ఆరు పరీక్షా కేంద్రాల పరిధిలో 934మందికిగాను 918 మంది హాజరుకాగా, 16 మంది గైర్హాజరయ్యారు. చందర్లపాడు మండలంలో నాలుగు పరీక్షా కేంద్రాల పరిధిలో 704మందికిగాను 693 మంది హాజరయ్యారు. 11 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. వీరులపాడు మండలంలోని నాలుగు పరీక్షా కేంద్రాల్లో 446 మంది విద్యార్థులకుగాను 426మంది పరీక్షకు హాజరుకాగా, 20మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. అదేవిధంగా జగ్గయ్యపేట నియోజకవర్గంలోని 15 పరీక్షా కేంద్రాల పరిధిలో 2,556మంది విద్యార్థులకుగాను 2,536మంది హాజరవగా 20మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఈవైఈఓ వివరించారు.

పరీక్ష కేంద్రం తనిఖీ

పెనుగంచిప్రోలు:స్థానిక కెవీఆర్ జెడ్పీ హైస్కూల్‌లోని పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని నందిగామ ఆర్డీఓ కె.బాలకృష్ణ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో సమర్థవంతంగా పదోతరగతి పరీక్షలు నిర్వహిస్తున్నారన్నారు. వేసవి ఉష్ణోగ్రతలు దృష్ట్యా విద్యార్థులకు తాగునీరు, వైద్య సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రంలోని వైద్యశిబిరాన్ని పరిశీలించారు.

ఏప్రిల్ 11న బీఎస్పీ ఆధ్వర్యంలో ధర్నా



ఉదయ్‌కిరణ్‌కు నియామకపత్రం అందజేస్తున్న పార్టీ నాయకులు

నందిగామ రూరల్: విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలలో బీసీలకు 52శాతం రిజర్వేషన్‌లు కల్పించాలని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి బచ్చలకూర పుష్పరాజ్ డిమాండ్ చేశారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం పార్టీ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 11న మహాత్మా జ్యోతీరావు పూలే జయంతి సందర్భంగా బీసీలకు 52శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ విజయవాడలోని కలెక్టరేట్ వద్ద పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యకర్తలు, బీసీలు పెద్దసంఖ్యలో పాల్గొని ధర్నాను విజయవంతం చేయాలని కోరారు.

జిల్లా అధ్యక్షుడిగా ఉదయ్‌కిరణ్..

నందిగామకు చెందిన యరగొర్ల ఉదయ్‌కిరణ్ యాదవ్ బీఎస్పీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఆయనకు నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు దొండపాటి శామ్యూల్‌కుమార్, కొదమల ప్రభుదాసు, గంగవరపు దేవ, దాసరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.